బీబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీబీఏ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీలను మార్చినట్లు చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ కార్యవర్గం

సుల్తాన్‌బజార్, మే 28: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ నూతన కార్య వర్గం ఏర్పాటైంది. ఈ మేరకు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో వివిధ మెడికల్ కళాశాలల వైద్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీని ఎన్నుకున్నారు. జూన్ మాసంలో చేపట్టనున్న వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియను ఎలాంటి ఒత్తిళ్ళకు లొంగకుండా పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మెడికల్ కళాశాలల వైద్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్, కన్వీనర్లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాంబ శివారెడ్డి, డాక్టర్ జగతి, డాక్టర్ హేమలత, డాక్టర్ అమరావతి, కో కన్వీనర్లు డాక్టర్ సూర్య నారాయణ, డాక్టర్ బెంజిమెన్, డాక్టర్ మనీష్ గుప్తా, డాక్టర్ అరుణ, డాక్టర్ నీలవేణి, డాక్టర్ శిరోమణిలు విలేకరులతో మాట్లాడుతూ వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియలో సంఘాల నాయకుల ఒత్తిళ్ళకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్లు మాధవ్, జితేంద్ర, అమరావతి, రమాదేవి, కవిత, నాగవేణి, మూసాఖాన్, గణేశ్, గౌరి, శకుంతల, రవిమోహన్, విజయ్ కుమార్, శ్రీవాణి పాల్గొన్నారు.

10 స్టార్టప్‌లు ఎంపిక

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ) : టీ హబ్ చేపట్టిన స్కిల్ ఇండియా డిజిటల్ యాక్సిలరేటర్ కార్యక్రమానికి 10 స్టార్టప్‌లను ఎంపిక చేశామని టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్‌డీసీ, హెచ్‌డీఎఫ్‌సీ సహకారంతో వివిధ రంగాల్లో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 369 దరఖాస్తులు రాగా అందులో ఉత్తమంగా ఉన్న 10 స్టార్టప్‌లను ఎంపిక చేశామని తెలిపారు. ఈ జాబితాలో కొనోమియల్, కర్మిన్, క్రియాన్ వర్సిటీ, హమ్‌లాగ్‌జాబ్స్, ఫ్రిద్ధి ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎడ్యుబక్, ఆన్‌లైన్ సాథీ, హాబీ, స్కైస్కిల్ అకాడమీ, ది క్యూబ్ స్టార్టప్‌లు ఉన్నాయని తెలిపారు.

నోటాకు అధిక ఓట్లు వస్తే రీ పోల్

నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రకటించాలి

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి, చిత్రంలో పద్మనాభ రెడ్డి

ఖైరతాబాద్, మే 28 : ఓటరు తనకు ఏ అభ్యర్థి నచ్చకపోతే నోటాకు ఓటు వేస్తారని, ఒక వేళ నోటాకు అధిక ఓట్లు వస్తే వెంటనే ఆ నియోజకవర్గంలో రీపోల్ చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి అధ్యక్షతన పంచాయతీ ఎన్నికల్లో నోటా అమలుపై జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి హాజరై ప్రసంగించారు. నోటా అమలు తర్వాత జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నోటాకు సుమారు 1.5శాతం ఓట్లు వచ్చాయని, నోటాకు అధిక ఓట్లు వచ్చినా రీపోల్ జరిగే వెసలుబాటు లేదన్నారు. ఈ విషయంపై సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నదని, పలు సందర్భాల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటాను ఓ కల్పిత అభ్యర్థిగా ప్రకటిస్తూ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఇతర అభ్యర్థుల కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే రిపోల్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ రీ పోల్‌లో మొదట బరిలో ఉన్న అభ్యర్థులెవరూ పోటీ చేయడానికి వీలు లేదన్నారు. నోటాను బలపర్చడానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చేస్తున్న కృషిని అభినందించారు. పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ వచ్చే రెండు మూడు నెలల్లో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నదని, 2019 లో జరిగిన ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికల్లో సుమారు 16 శాతం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఇందులో అధికంగా వేలం పాటలో గెలిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారని, ఇక్కడ గ్రామ కమిటీలు, కుల సంఘాలు రాజ్యాంగేతర శక్తులుగా పనిచేస్తూ సర్పంచ్ పదవులను వేలం వేస్తున్నారని తెలిపారు. ఏకగ్రీవ ఎన్నికల వల్ల సామాన్యులు ఓటు హక్కును కోల్పోతారని, ఈ పరిస్థితి మారాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు బి.మన్మథ రెడ్డి, విశ్రాంత డీజీపీ గోపాల్ రెడ్డి, లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్ రావు, ఎన్నికల నిఘా వేదిక ప్రతినిధి వీవీ రావు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భావి పౌరులుగా ఎన్‌సీసీ విద్యార్థులు ఎదగాలి

సుల్తాన్‌బజార్, మే 28 : ఎన్‌సీసీ విద్యార్థులు బాధ్యత కలిగిన భావిభారత పౌరులుగా ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ, ఐఏఎస్ దానకిశోర్ అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్ కళాశాలలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు 3వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం (ఏటీసీ-టీఎస్‌సీ) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ హాజరై ప్రారంభించారు. లెఫ్టినెంట్ కల్నల్ శరత్ మాట్లాడుతూ సైఫాబాద్ సైన్స్ కళాశాల, ఉస్మానియా యూనివర్సిటీలలో ఎన్‌సీసీ వార్షిక శిబిరాన్ని నిర్వహించడానికి క్యాడెట్లకు అవకాశం, వసతి కల్పించినందుకు ఓయూ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జూన్ 7నుంచి కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు

కేర్ ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేర్ ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్, మే 28 : గుండె సంబంధిత వ్యాధుల సమస్యలు, చికిత్సా విధానాలపై కేర్ ఆస్పత్రి, ఇండో జపనీస్ సీటీవో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 7నుంచి 9 వరకు అంతర్జాతీయ వైద్య సదస్సు నిర్వహించనున్నారని ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్ డా.బి.సూర్యప్రకాశ్ రావు తెలిపారు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనరీ ఆర్టరీ డిసీజ్(సీఏడీ)తో బాధపడే రోగులకు అందించే చికిత్సలపై దేశవిదేశాలకు చెందిన వైద్య నిపుణులు చర్చించనున్నారని, దేశంలో హృద్రోగులలో 27శాతం మంది సీఏడీతో మృతి చెందుతున్నారన్నారు. దీంతోపాటు క్రానిక్ టోటల్ అక్లూజన్(సీటీవో)తో బాధపడుతున్న చిన్నారులు, వృద్ధులకు జపనీజ్ టెక్నాలజీతో చేస్తున్న సర్జరీలతో 90శాతం సక్సెస్ రేటు ఉందన్నారు. ఇలాంటి అనేక వినూత్న విధానాలపై అంతర్జాతీయ సదస్సులో చర్చించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ప్రియన్ కాంతి లాల్‌షా, డా.కిరణ్‌కుమార్, డా.ఏఎస్‌వీ.నారాయణరావు, డా.పీఎల్ఎన్.కపర్తి, డా.విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కాంట్రాక్టర్లతో ప్యాచ్‌వర్క్ పనులు

జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు రూ.1350 కోట్ల బకాయిలు

మంగళ్‌హాట్ డివిజన్ కార్పొరేటర్ శశికళాకృష్ణ

గుఫానగర్ ముత్యాలమ్మ టెంపుల్ వద్ద కొనసాగుతున్న ప్యాచ్ వర్క్ పనులను పర్యవేక్షిస్తున్న మంగళ్‌హాట్ డివిజన్ కార్పొరేటర్ శశికళాకృష్ణ

అబిడ్స్, మే 28 : డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు మంగళ్‌హాట్ డివిజన్ కార్పొరేటర్ శశికళాకృష్ణ అన్నారు. మంగళవారం గుఫానగర్ ముత్యాలమ్మ టెంపుల్ కమాన్ వద్ద రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి పాదచారులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఆమె ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ సహాయంతో ప్యాచ్ వర్క్ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు పాత బకాయిలు రూ.1350 కోట్లు చెల్లించకపోవడంతో గుత్తెదారులు పనులు చేయడానికి ముందుకు రావడంలేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గత ప్రభుత్వంలో రూ. 950 కోట్లు ఉన్న బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే రూ. 1350 కోట్లకు చేరిందని ఆమె అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా కార్పొరేషన్ పరిధిలో ఎటువంటి అభివృద్ధి పనులకు నిధులను విడుదల చేయలేదని అన్నారు. దీంతో స్థానిక కార్పొరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ కాంట్రాక్టర్‌లతో ప్యాచ్‌వర్క్ పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించి, రద్దు చేసిన పాత టెండర్లను సాంక్షన్ చేసి రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉస్మానియా దవాఖాన నూతన భవనం నిర్మించాల్సిందే

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరామ్

సుల్తాన్‌బజార్, మే 28 : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చికిత్సల నిమిత్తం ఉస్మానియా దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలంటే దవాఖానకు నూతన భవనం నిర్మించాల్సిందేనని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ పేర్కొన్నారు. మంగళవారం ఉస్మానియా దవాఖానలోని సూపరింటెండెంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఉస్మానియా యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణారెడ్డి, కార్యదర్శి డాక్టర్ రంగా అజ్మీరా, ఉస్మానియా అలుమ్ని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ క్రిష్ణారెడ్డి, కార్యదర్శి డాక్టర్ క్రిష్ణమూర్తి సంయుక్తాధ్వర్యంలో ఉస్మానియా నూతన భవన నిర్మాణంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, టీఎస్ఎంసీ చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్, హెరిటేజ్ కమిటీ సభ్యులు అనురాధారెడ్డి, జావీద్ ఇక్బాల్‌లతో పాటు వైద్యుల సంఘం ప్రతినిధులు, దవాఖాన వివిధ విభాగాల హెచ్‌వోడీలు, జూడాలు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది ఈ సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజీజ్‌పాషా, సియాసత్ సంపాదకులు అమీర్ అలీఖాన్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ పాండునాయక్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రమేశ్ కుమార్, డాక్టర్ తపాడియా, డాక్టర్ జి.రమేశ్, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ రాఖేశ్ సహాయ్, డాక్టర్ రఫీ, డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ సుష్మ, డాక్టర్ మాధవి, డాక్టర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

సురవరం జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి

సీనియర్ పాత్రికేయుడు ఉడయవర్లకు సురవరం ప్రతాప్‌రెడ్డి అవార్డును బహూకరిస్తున్న డా.కేవ వరప్రసాద్‌రెడ్డి, కె.విరాహత్‌అలీ

శాంతా బయోటెక్ ఎండీ డాక్టర్ కేవ వరప్రసాద్‌రెడ్డి

రవీంద్రభారతి, మే 28 : తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పూర్తి జీవిత చరిత్రను నేటి తరానికి అందించడానికి పాఠ్యాంశాలలో చేర్చాలని శాంతా బయోటెక్ ఎండీ డాక్టర్ కేవ వరప్రసాద్‌రెడ్డి కోరారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి సురవరం పేరుతో ప్రత్యేక సాహిత్య అవార్డును ప్రదానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాహితీ పురస్కారం-2024ను ప్రముఖ పాత్రికేయులు ఉడయవర్లకు ప్రదానం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.కేవ వరప్రసాద్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. తెలంగాణ సాహిత్య రంగంలో కొత్త చరిత్రను సృష్టించిన వ్యక్తి సురవరం ప్రతాప్‌రెడ్డి అని కొనియాడారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్‌అలీ మాట్లాడుతూ సురవరం ప్రతాప్‌రెడ్డి, సోయాబుల్లా ఖాన్ నేటి జర్నలిస్టులకు ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి, సురవరం పుష్పలత, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శత జయంతి సంచిక, టాంక్‌బండ్ విగ్రహాల ప్రశస్తి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు జాతి గర్వించదగిన మహోన్నతుడు ఎన్టీఆర్

విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్.జయప్రకాశ్ నారాయణ

తెలుగు యూనివర్సిటీ, మే 28: తెలుగు జాతి గర్వించదగిన మహోన్నతవ్యక్తి ఎన్టీఆర్ అని వక్తలు కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో చెన్నపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా పుస్తకాల ఆవిష్కరణ సభ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్@100 శత జయంతి సంచికతో పాటు టాంక్‌బండ్ విగ్రహాల ప్రశస్తి పుస్తకాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్.జయప్రకాశ్ నారాయణ ఆవిష్కరించి ఎన్టీఆర్ వ్యక్తిత్వాన్ని, రాజకీయంగా రాణించి పరిపాలనతో తీసుకువచ్చిన సంస్కరణలపై తన ప్రసంగంలో వివరించారు. సీనియర్ సంపాదకులు కె.రామచంద్ర మూర్తి, సినిమా రచయిత డాక్టర్ పరుచూరి గోపాలకృష్ణ, సాహితీవేత్తలు డాక్టర్ బీరం సుందరరావు, డాక్టర్ తూమాటి సంజీవరావు, రింగు రామ్మూర్తి, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

జూన్ 2న ఉద్యమకారులను సన్మానించాలి

గన్‌పార్కులో అమరవీరులకు నివాళులర్పించిన ఉద్యమకారులు.

తెలుగు యూనివర్సిటీ, మే 28 : చారిత్రాత్మకమైన 1969 తొలిదశ ఉద్యమం స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చక్రాహరి రామరాజు పేర్కొన్నారు. గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం పలువురు ఉద్యమకారులు పాల్గొని అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. జూన్ 2న ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం గౌరవంగా సన్మానించాలని కోరారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామరాజు

సిటీబ్యూరో , మే 28(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రామరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ స్టేట్ మీడియా సెక్రటరీ రామచంద్రం తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, 317 జీవో బాధితులకు తక్షణ న్యాయం, పెండింగ్ డీఏలు విడుదల, పీఆర్సీ అమలుపై చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎంకే రాజు, జానకి బాయి, మల్లేష్, ప్రతాప్, సైదులు పాల్గొన్నారు.

'చెన్నైస్ అమిర్త'లో ఏవియేషన్ కోర్సు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ) : ఈ విద్యా సంవత్సరం నుంచి 'చెన్నైస్ అమిర్త' కళాశాలలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ కోర్సులను కొత్తగా ప్రవేశ పెట్టినట్లు ఆ సంస్థ చైర్మన్ ఆర్ భూమినాథన్ తెలిపారు. ఇందుకోసం ఈ నెల 17న మలేషియాకు చెందిన యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఏవియేషన్ మేనేజ్‌మెంట్‌తో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ గ్రీన్ పార్క్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత 14ఏండ్లుగా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. వేగంగా మారుతున్న సాంకేతికత పరిణామాల నేపథ్యంలో వైమానిక విద్యను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ విద్య నందించేందుకు సింగపూర్‌కు చెందిన బిర్మింగ్ హోం అకాడమీతో రెండో ఒప్పందం చేసుకున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా ఏవియేషన్ కోర్సులకు సంబంధించిన నూతన లోగోను భూమినాథన్ ఆవిష్కరించారు. సమావేశంలో చెన్నైస్ అమిర్త సంస్థ సీఈవో కవితానందకుమార్, సీఏడీ లియో ప్రసాద్, డీన్ డాక్టర్ టి.మిల్టన్, కళాశాల అడ్మినిస్ట్రేటర్ భానుమతి, హైదరాబాద్ క్యాంపస్ ప్రిన్సిపాల్ తామరకొలను చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

యానిమల్ బయో టెక్నాలజీలో ఫౌండేషన్ డే

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 28(నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి గౌలిదొడ్డిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(నాయబ్)లో 13వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పశు సంవర్ధక శాఖ మాజీ సెక్రటరీ తరుణ్ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశు సంపద ను వృద్ధి చేయడంలో విప్లవాత్మక పరిశోధనలకు నాయబ్ వేదికగా నిలుస్తుందని కొనియాడారు. అందుబాటులోకి వచ్చిన బయో టెక్నాలజీ వన్య ప్రాణుల సంరక్షణలో కీలకం గా మారిందన్నారు. అదే విధంగా అంతు చిక్కని జంతు సంబంధిత వ్యాధుల నియంత్రణలో విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయబ్ డైరెక్టర్ డా.తారు శర్మ, పరిశోధకులు హాజరయ్యారు.

హైకోర్టు అడిషనల్ ఏజీ పోస్టును మాదిగలకు కేటాయించాలి

మాదిగ రాజ్యాధికార పోరాట సమితి

మాట్లాడుతున్న మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజు

రవీంద్రభారతి, మే 28 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా హైకోర్టులోని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టును మాదిగలకు కేటాయించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు మాదిగ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇతర మాదిగ నేతలతో కలిసి నవీన్‌రాజు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదిగలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాదిగల కోరిక మేరకు హైకోర్టులోని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టును కేటాయించిన విషయం గుర్తించాలని తెలిపారు. ఇదే మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం హైకోర్టులోని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఇతర ఉన్నత పదవులు మాదిగలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమ జాతికిచ్చిన హామీలు నెరవేర్చడంలో సానుకూలంగా ప్రయత్నించాలన్నారు. గత రెండు రోజుల క్రితం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదర్ రాజనరసింహను కలిసి మాదిగలకు ఉన్నత పదవుల హామీలపై చర్చించామని అన్నారు. తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మాదిగలకు ఉన్నత పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు బి.ఉపేందర్, జయరామరాజు, ఎ.మల్లేశ్, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జలవిహారం.. జనసంద్రం నగర వాసులు పిల్లలతో కలిసి వేసవి సెలవులను హ్యాపీగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళ వారం జలవిహారం జనంతో పోటెత్తింది. జలపాతంతో పొద్దంతా ఆడుతూ.. పాడుతూ గడిపారు.